


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**87**

**(22` ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

అర్ధరాత్రి అంతా నిశ్శబ్దం. రోడ్డుకు కొంచెం విశ్రాంతి చిక్కినట్లుంది. వొత్తికిలి పడుకుంది. వీధి దీపాలు కారుచీకటిని పారద్రోలలేక చిన్నపుచ్చుకుంటున్నాయి.

ఆకాశం వంక చూశాను. పాతికవత్సరాలు స్వతంత్ర్యమనుభవించిన ఆకాశం. అంతులేని చుక్కలు. చంద్రుడు లేని ఆకాశం. "బాపూజీ లేని భారతదేశం" అన్నమాటను జ్ఞాపక చేసింది. ఆకాశం మీద చందమామ మళ్ళా ఉదయిస్తాడు. బాపుజీ.. మళ్ళీ ఎప్పటికో? ఏమో?

***ఆకాశం మీద అక్షరాలు***

ఆకాశం వంక అలా చూస్తూ నిలబడ్డాను. ఒక అదృశ్య హస్తం ఏవో అక్షరాలు వ్రాస్తోంది. ఏ వేలు కొసనుంచో వెలుగు కలం చకచకా వ్రాసింది, "స్వాతంత్ర్య భారత రజతోత్సవం" అనే వాక్యం.

నిజం స్వాతంత్ర్యం వచ్చి పాతికవత్సరాలైంది. `స్వాతంత్ర్యం` అనే మాట చాటున ఎందరో ఎదురొడ్డిన ప్రాణాలు, ఎందరో సాగించిన రణాలు, ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, విసర్జించిన భోగాలు, భారతీయులందరినీ ఒకటిగా చేయడానికి సమకూర్చిన అనురాగాలు, చెరసాలల ఇనుప కటకటాలు, పోలీసుల చేతుల్లో లాటీలు, కాంగ్రెసు మహాయోధుల భేటీలు, బ్రిటిష్‌వారు దమన నీతిని ప్రదర్శిస్తూ జరిపిన లూటీలు, ఎన్నెన్నో దృశ్యాలు కనిపించినాయి. భారత ప్రజల కష్టాలు చూచి కరిగిన గాంధీజీ కనిపించారు. గాడ్సే కిరాతచర్యకు గురి అయి నేలకు ఒరిగిన మహాత్ముడు కనిపించాడు. భారత స్వాతంత్ర్య చరిత్ర బంగారు పుటలతో చిత్రించబడిన పవిత్ర చరిత్ర.

ఆ చరిత్ర స్మృతులలో మునిగి ముచ్చటపడుతూ, ఆ నాయకుల దృఢసంకల్పాన్ని త్యాగనిరతినీ దేశభక్తినీ తలచి అచ్చెరువొందుతూ అలా నిలిచిపోయాను. కొంతసేపు ఆ అక్షరాల మీదనే వుంది చూపు.

***ఆకాశపుటంచుల్లో ఊరేగింపు***

ఇంతలో ఆ అక్షరాలు తొలిగిపోయినాయి. `నెహ్రూజీ పరిపాలన` అనే శీర్షిక మరింత పెద్ద అక్షరాలతో కనిపించింది. ఆయన ప్రణాళికలు రూపొందించిన విషయం జ్ఞాపకమొస్తుంది. ప్రాజెక్టులను ఆయనగారు శంఖుస్థాపనలు చేస్తున్న దృశ్యాలు కనిపించాయి.

దేశంలో పేదరికాన్ని, నిరక్షరాస్యతను, తొలగించడం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. భారత ప్రజానీకానికి ప్రియతమ నాయకుడయ్యాడు. గులాబివాసనలు గుబాళించే ఆ మహానాయకుని స్మరిస్తూ కొంచెం సేపు పచార్లు చేశారు. "జవహర్‌లాల్ నెహ్రూకూ జై" అనే ఒక పెద్ద కేక. భారతమాత పులకరించే కేక వినిపించిందాకాశం మీదనుంచి. ఉలిక్కిపడి విన్నాను. వీధిలో ఇంకా ఆ కేక మారుమ్రోగుతూనే ఉంది. అంతులేని ప్రజల ఊరేగింపు ఆకాశపుటంచుల వరకూ సాగుతూనే ఉంది.

నెహ్రూజీ భారత ప్రధాని. ప్రప్రథమ భారత ప్రధాని హిమాలయాలల్లో ధవళకీర్తి నార్జించుకున్న వంశానికి చెందిన మహానాయకుడు భారతదేశ సౌభాగ్యం కోసం జీవితాలను పణం పెట్టిన వంశంలో జన్మించిన త్యాగమూర్తి - ఇలా ఆలోచిస్తూ నిలబడి పోయాను చాలాసేపు.

ఆకాశం మీద అక్షరాలు మళ్ళీ చెరిగిపోయినా ప్రధాని లాల్ బహదూర్ అన్న వాక్యం కనిపించింది. ఆ పొట్టి నాయకుడు గట్టి నాయకుడు భారత ప్రధానిగా నియమితుడై అమిత ప్రజ్ఞతో పరిపాలన సాగించిన దృశ్యాలు కనిపించినాయి.

***లాల్‌బహదూర్ వీరహక్కులు***

బలహీనమైన శరీరం. అద్భుతమైన ఆత్మశక్తి, ధర్మానురక్తి, దాగిన శౌర్యం. ఆ నాయకుని గురించి ఆలోచించాను. పాకిస్తాన్‌తో యుద్ధం సంభవించినప్పుడు అతి పరాక్రమంతో నిలిచి, శత్రువులను తరిమిన నాటి ఆయన ప్రతాపం తలచుకుని ఆనందించాను.

రవంత జంకకుండా, ఆ సమర సమయంలో ఆయన చేసిన ప్రసంగాలు వినిపించినాయి "ఆయుధాలకు ఆయుధాలతోనే జవాబు" అని రేడియోలో చేసిన ఆయన ప్రసంగం చెవి దగ్గర మారుమ్రోగింది. ఒక శౌర్యపు కెరటంగా ఊగింది.

ఇంతలో ఆకాశంలో కారుమబ్బు ఒకటి ముంచుకు వచ్చింది. ఏ దృశ్యం కనిపించలేదు. ఏ భావం స్ఫురించలేదు. విచారిస్తూ ఆ మబ్బువంక చూస్తున్నాను. దానికి "తాష్కెంటులో శాస్త్రీజీ మరణం" అన్న విషాద వాక్యం కనిపించింది. కళ్ళవెంట జడివాన కురిసింది.

ఆ మహనీయుడు మరణించాడు. భారతదేశం చిన్నపుచ్చుకుంది. భారత ప్రజల ఆత్మల్లో ఏదో బాధ తొంగిచూచింది. ఎవరు నాయకులు? అనే ప్రశ్న భారతదేశమంతటా వినిపించింది.

"ఎవరెవరు? ఎవరు. రెండు మహోన్నత శిఖరాలు ఒరిగిపోయినాయి. కానీ అవి గొప్ప విజయస్థంభాలుగా నిలిచిపోయినాయి. వాటి ప్రతిష్ఠను, ప్రతిభను నిలబెట్టగల నాయకుడెవరు ఎవరు?" అని అందరూ ఆలోచనానిమగ్నులయ్యారు.

***ఇందిరా ప్రియదర్శిని దర్శనం***

ఆ సమయంలో ప్రధానిగా అవతరించింది ఇందిరాప్రియదర్శిని. నెహ్రూజీ ఏకైక పుత్రిక. గులాబి వంశానికి చెందిన ఒక దొంతర గులాబీ. ఎంత గొప్ప వార్త.

ఆకాశం వంక చూశాను. "ప్రధాని ఇందిరా ప్రియదర్శిని" అనే అక్షరాలు ప్రచురించినాయి. "మహిళా ప్రధాని భారతదేశ ప్రధాని కోటానుకోట్ల భారతీయుల భావి జీవన పథాన్ని సరిదిద్ద సంకల్పించిన వనిత" అని అందరూ ఆశ్చర్యంగా చూశారు. ఆమెకు సంబంధించిన విశేషాలు శ్రద్ధతో విన్నారు.

***గులాబి సంతానం గొప్ప వారసత్వం***

ప్రియదర్శిని.. కొద్దిరోజులలోనే గొప్ప మార్గదర్శిని కావలసింది. ప్రపంచ చరిత్రలో "ప్రథమ మహిళాప్రధానిగా" పేర్కొనబడింది. నెహ్రూజీ సంతానం ఎంత గొప్పవారసురాలు. ఇందిర పరిపాలనా దక్షతకు లోకం ఆశ్చర్యపోయింది. భారత ప్రజానీకం అబ్బురపోయింది. `ఇందిర యుగం` ప్రారంభమైంది. రాజనీతిలో దిట్టగా నిలబడగలిగింది.

ఇందిర పేరు ఇంటింటా మారు మ్రోగింది. ఆమె పేరు వినిపించిన చోట విజయం తొంగిచూసింది. మహాశక్తి అన్నారు. పాకిస్తాన్‌తో వైరం వచ్చినప్పుడు మహిషాసురమర్దని అన్నారు. అన్నిటా సమర్థురాలనిపించుకుంది.

నవయుగానికి నాంది గీతాలు పాడింది. కాంగ్రెసులో క్రొత్త కాంగ్రెసు క్రొత్త కాంగ్రెసులో గులాబి వర్ణం ఎంతో ఘనత సంపాదించింది.

### పేరు వినిపిస్తే విజయం

ఆమె పట్టుదలను దయాగుణాన్ని ధర్మగుణాన్నీ ప్రదర్శించడం కోసం బంగ్లా యుద్ధం వచ్చింది. అందులో అవలీలగా విజయం సంపాదించింది. అమెరికాను సైతం లెక్కచెయ్యలేదు.

పాకిస్తాన్‌కు స్నేహ హస్తం జాచింది. అనంత శక్తి ప్రదర్శించింది. ఇందిర పరిపాలనలో ఈ రజతోత్సవం జరుగుతోంది. ఎంతో గొప్పగా జరుగుతోంది.

ఈ మహోత్సవాన్ని తిలకిస్తున్నాను. ఈ పాతికేళ్ళ చరిత్ర స్మరిస్తున్నాను. స్వర్ణోత్సవం సమయంలో భారతమాత శక్తి స్వరూపాన్ని తిలకించి పులకరించే భాగ్యం నా మనుమలకు, మనుమరాండ్రకు వదులుతున్నాను. ఆనాటిదాకా ఈ చిన్నివ్యాసాన్ని దాచుకొమ్మని కోరుతున్నాను.

Post your comments